సాక్షి
శ్రీకాకుళం
గురువారం ׀ 24 ׀ అక్టోబర్ ׀ 2024



ముగిసిన సపక్‌తక్ర స్టేట్‌మీట్

సిక్కోలు వేదికగా జరిగిన సపక్‌తక్ర చాంపియన్‌షిప్–2024 పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. – 8లో



మోక్షమెప్పుడో?

తాము అధికారంలోకి వస్తే మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామన్న కూటమి నేతల హామీ నెరవేరడం లేదు. దీంతో గిరిజనులు ఇబ్బందిపడుతున్నారు. – 8లో

బీఈడీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం విడుదల చేశారు. వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 1044 మంది హాజరు కాగా 1009 మంది ఉత్తీర్ణత సాధించారని, 96.65 శాతం ఫలితాలు నమోదైనట్లు వివరించారు.

దానా తుఫాన్
అంతటా అప్రమత్తం



- జిల్లాపై దానా తుఫాన్ ప్రభావం
- రెండు రోజుల పాటు భారీ వర్ష సూచన
- మండల స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్
- వైద్య, విద్యుత్ ఉద్యోగులకు సెలవులు రద్దు

కంట్రోల్ రూం నెంబర్
08942-240557

శ్రీకాకుళం పాతబస్టాండ్:

'దానా' తుఫాన్ ప్రభావంతో ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ సారి ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలసి కంట్రోల్ రూమ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాగావళి, వంశధార, బహుదా, మహేంద్ర తనయ నదుల పరిధిలోని కాలువ గట్లకు మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలన్నారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం (08942-240557) ద్వారా తుఫాన్ నష్ట సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు.

- జిల్లా వ్యాప్తంగా ఐదువేలకు చెరువులు ఉండగా అందులో 1004 చెరువు గట్లు బలహీనంగా ఉన్నాయని, తుఫాన్ వల్ల సామర్థ్యానికి మించి నీరు చేరితే గట్లు తెగే అవకాశం ఉన్నందున ఇసుక బస్తాలతో పటిష్టం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
- కంట్రోల్ రూమ్‌కు సంబంధించి నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున, తీర ప్రాంత నియోజకవర్గాలలో మండలానికి ఒకరు చొప్పున షిప్టుల వారీగా సిబ్బంది స్థానిక పరిస్థితులను నమోదు చేసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో నమోదైన సమస్య పరిష్కరించేంతవరకు నిరంతరం ఫాలోఅప్ చేస్తూనే ఉండాలన్నారు.



- ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నామని, కంట్రోల్ రూమ్ సిబ్బంది ప్రతీ 2గంటలకి పూర్తిస్థాయి బులిటెన్ ఇవ్వాలని ఆదేశించారు. నదీ ప్రవాహాల వేగాలను నమోదు చేయాలన్నారు. సెకండ్ లెవెల్ ఆఫీసర్లు పలాస, ఇచ్ఛాపురంలలో విధులు నిర్వహించాలని ఆదేశించారు.
- చెరువులు, వాగులు ఓవర్ ఫ్లో, పునరావాస శిబిరాలు తదితరాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు గూగుల్ షీట్లలో అప్‌లోడ్ చేయాలన్నారు. పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక డ్రోన్, తీర ప్రాంతంలో ప్రతి మండలానికి ఒక డ్రోన్ చొప్పున మొత్తం 20 డ్రోన్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

సమావేశంలో శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ పి.సుధాకర్, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆఫీసర్ రాము, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

● వైద్య బృందం.. సర్వసన్నద్ధం

అరసవల్లి: దానా తుఫాన్ తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నందున జిల్లాలో ముఖ్యంగా తీర ప్రాంత మండలాల్లో తక్షణ వైద్య సాయం అందించేందుకు వైద్యబృందమంతా సన్నద్ధంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి ఆదేశించారు. బుధవారం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ఆశా, ఏఎన్‌ఎంలతో సర్వే చేయించి పారిశుద్ధ్యం, తదితర పరిస్థితులను పంచాయతీ అధికారులకు తెలిసేలా చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ తీవ్రత తగ్గే వరకు వైద్యారోగ్య శాఖ సిబ్బందికి సెలవులన్నీ రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించారు. 24గంటలూ విధుల్లో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షం అనంతరం పల్లెల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా బావుల్లో క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. డయేరియాతో విజయనగరం జిల్లా గుర్లమండలంలో దారుణం జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా నీటి పరీక్షలు చేయించాలన్నారు. సచివాలయానికి రెండేసి చొప్పున మొత్తం 1000 పరీక్షలను టార్గెట్‌గా నిర్దేశించినట్లు వివరించారు. గర్భిణులను గుర్తించి సమీపంలో సీహెచ్‌సీలకు తరలించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలిగితే వ్యాక్సిన్లు భద్రపరిచేందుకు ముందుగానే జనరేటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ద్వారా దానా తుపాను తీవ్రతను ఎదుర్కొనేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



వైద్యులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

● విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

అరసవల్లి: దానా తుఫాన్ కారణంగా విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఉండే అవకాశమున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆదేశించారు. బుధవారం డివిజనల్, సబ్‌డివిజనల్, సెక్షన్ ఇంజినీర్లుతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలో 13 మండలాల్లో తుఫాన్ ప్రభావం ఉండొచ్చునని, మరో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. అప్పటి వరకు సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తుఫాన్ తగ్గాక విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఇందుకు వీలుగా విద్యుత్ పునరుద్ధరణకు 13 మండలాలకు 255 మంది కార్మికులు, 13 క్రేన్లు, 350 ట్రాన్స్‌ఫార్మర్లుతో పాటు 9.1 మీటర్ల విద్యుత్ స్తంభాలు 354, అలాగే 8 మీటర్ల విద్యుత్ స్తంభాలు 337 వరకు సిద్ధం చేశామని వివరించారు. వినియోగదారులకు ఎటు వంటిసమస్యలు ఎదురైనా 1912 నంబర్‌కు డయల్ చేసి వివరాలను తెలియజేయాలని సూచించారు.



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఈ కృష్ణమూర్తి

శ్రీకాకుళం	9490610045
టెక్కలి	8332843546
పలాస	7382585630 లో

హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు.

● రైతుల గుండెల్లో 'దానా'దడ

ఇచ్ఛాపురం రూరల్: దానా తుఫాన్ హెచ్చరికలతో ఉద్దానం రైతుల గుండెల్లో దడ ప్రారంభమైంది. 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్ నుంచి 2018లో వచ్చిన తిత్లీ వరకు వరుసగా వచ్చిన తుఫాన్‌లకు ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతులు అతలాకుతలం అయిపోయారు. ఆరేళ్ల తరువాత వస్తున్న ఈ తుఫాన్ తీవ్రత ఎలా ఉంటోందనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి వరి పంట పొట్ట దశలో ఉంది. తేలికపాటి వంగడాలు ఎన్ను దశలో ఉన్నాయి. ఈ సమయంలో తుఫాన్ సంభవిస్తే కోలుకోలేని దెబ్బ తప్పదని ఆందోళన చెందుతున్నారు.



ఇచ్ఛాపురం మండలంలో కళకళలాడుతున్న వరి పంట

● 23 రైళ్లు రద్దు



కాశీబుగ్గ: దానా తుఫాన్ నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల మీదుగా శ్రీకాకుళం జిల్లాలో ప్రయాణించే 23 రైళ్లను ఈ నెల 24న రద్దు చేస్తున్నట్లు ఈస్ట్ కోస్టు రైల్వే, ఖుర్దా రైల్వే డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రద్దయిన వాటిలో భువనేశ్వర్–ముంబై(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ – చెన్నై (12830) చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, పూరీ– షాలీమార్ (12822) షాలీమార్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పలాస – కటక్ (08534) స్పెషల్ ట్రైన్, చెన్నై – భువనేశ్వర్ (12829) ఎక్స్‌ప్రెస్, షాలీమార్ – పూరీ (12821) ధౌలీ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు – హౌరా (22888) బెంగళూరు ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – మల్దా టౌన్ ఎక్స్‌ప్రెస్ (03429), తిరునవెల్లి – షాలీమార్ (06087) షాలీమార్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

● రైల్వేస్టేషన్‌లో సమాచార కేంద్రం

ఆమదాలవలస: దానా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ప్రయాణికులకు సమాచారం అందించేందుకు శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు బుధవారం సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకునేందుకు 08942-286213 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



తుఫాన్ అత్యవసర సమాచార కేంద్రం

● రైళ్ల రద్దుతో ఆర్టీసీ బస్సులు కిటకిట



శ్రీకాకుళం అర్బన్: దానా తుఫాన్ ప్రభావంతో పలు రైళ్లు రద్దు కావడంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిశా వైపు పలు రైళ్ల రాకపోకలను అధికారులు రద్దు చేశారు. దీంతో చాలామంది శ్రీకాకుళం కాంప్లెక్సుకు వచ్చి బస్సులను ఆశ్రయిస్తున్నారు.

● తీరంలో దండోరా

శ్రీకాకుళం కల్చరల్: దానా తుఫాన్ నేపథ్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బందరువానిపేట, కళింగపట్నం, కె.మత్స్యలేశం తదితర తీరప్రాంత గ్రామాల్లో స్థానికులను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రమణ పాల్గొన్నారు.



మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న రెడ్‌క్రాస్ బృందం

న్యూస్‌రీల్

అంబేడ్కర్ వర్సిటీ ప్రత్యేకాధికారిగా సామ్రాజ్యలక్ష్మి



ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉద్యోగి కె.సామ్రాజ్యలక్ష్మిని ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు బుధవారం ఆమె విధుల్లో చేరారు. పరిపాలన, ఆర్థిక, పరీక్షల నిర్వహణ అంశాలను ఎస్‌ఓ హోదాల్లో పర్యవేక్షించనున్నారు. ఈమె ఏయూలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, జాయింట్ రిజిస్ట్రార్, ఫైనాన్స్ అధికారిగా, నూజివీడు ఆర్‌జీయూకేటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వంటి బాధ్యతలు నిర్వర్తించారు.

త్వరలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయిల కమిటీలను త్వరలోనే ఎంపిక చేయనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులతో పెద్దపాడులోని ధర్మాన క్యాంపు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లా కమిటీలో అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు. పార్టీ అనుబంధ కమిటీలు, ఆఫీసు బేరర్లు, యువజన విభాగం, విద్యార్థి, రైతు, ట్రేడ్ యూనియన్ తదితర విభాగాలను పటిష్టం చేస్తామన్నారు. అన్ని కమిటీల్లోనూ నియోజకవర్గాలకు సమ ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు. వీలైనంత త్వరగా కమిటీలు నియమించి ప్రకటించాలని తీర్మానించారు. సమావేశంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, పిరియా సాయిరాజ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

జలుమూరు: తిలారు రైల్వే గేట్ సమీపంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ బుధవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో బసివాడ–తిలారు గేటు మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ప్రకారం పోలాకి మండలం ఈదులువలస గ్రామానికి చెందిన కొర్ను శ్రీనివాసరావుగా గుర్తించారు. మృతుడికి భార్య, ఏడాది కొడుకు, తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. జేబులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు రైల్వే హెచ్‌సీ చక్రధర్‌రావు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్మోహన్‌రావు, ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి వై.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోండలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్‌ఎస్ ఇనుస్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కోల్గేట్ పామోలివ్, అపోలో ఫార్మసీ సంస్థల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తామని, వివరాలకు 70957 31303 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

న్యాయవిద్యకు బీసీఐ అనుమతి



ధ్రువీకరణ పత్రంతో వీసీ రజని, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని మహాత్మా జ్యోతీరావుపూలే న్యాయ కళాశాలలో మూడేళ్ల న్యాయ విద్య ప్రవేశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు లభించిందని వీసీ కె.ఆర్.రజిని బుధవారం చెప్పారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని ఫ్యాకల్టీ సభ్యులకు అందజేశారు. నిబంధనలు మేరకు ఫీజు చెల్లించి కమిటీని ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రస్తుతం పూర్తిస్థాయి ప్రవేశాలతో కోర్సు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, కోర్సు కో–ఆర్డినేటర్ వై.రాజేంద్ర ప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు జి.మన్మధరావు, టి.బాలకృష్ణ, కె.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఐటీఐ మిగులు సీట్ల భర్తీకి 28న కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో మిగులు సీట్లలో ప్రవేశానికి 5వ ఫేజ్‌లో దరఖాస్తుకునే అభ్యర్థులకు ఈ నెల 28న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహన్‌రావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఇప్పటికే నాలుగు విడతలు పూర్తి కాగా.. తాజాగా 5వ విడత ప్రవేశాలకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 28న బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం: కేజీబీవీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్ట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య బుధవారం తెలిపారు. అభ్యంతరాలను ఈ నెల 24 తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో తెలియజేయవచ్చని పేర్కొన్నారు.


ఫీజుల భారం తొలగించండి

టెక్కలి: డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఫీజుల భారం లేకుండా చూడాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు యు.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన నిధులు వచ్చే వరకు ఎటువంటి ఫీజులు చెల్లింపులు లేకుండా చూడాలని, స్పెషల్ ఫీజులను వసూలు చేయరాదని, కళాశాలల్లో విద్యార్థినులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.హరి, డి.చందు, బి.హరీష్ తదితరులు ఉన్నారు.



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కాంతమ్మా.. ఎక్కడమ్మా?



- 22 రోజులుగా కనిపించని వైద్యశాఖ సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ
- ఉద్యోగాల పేరిట రూ.లక్షలు వసూళ్లు చేశారని అభియోగాలు
- లబోదిబోమంటున్న బాధితులు
- మిస్సింగ్ కేసు నమోదు చేసిన సరుబుజ్జిలి పోలీసులు

బాధితులు క్యూ కడుతున్నారు...

కాంతమ్మ అనే సీనియర్ అసిస్టెంట్ ఈ నెల 2 నుంచి విధులకు రావడం లేదు. దీనిపై సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసు షీట్‌తో పాటు డీఎంహెచ్‌వో మీనాక్షికి నివేదించాను. ఉద్యోగ బాధితులంతా రోజూ కల్లేపల్లి పీహెచ్‌సీకి వచ్చిఆందోళన చేయడంతో వారికి ఎలా సర్ది చెప్పాలో తెలియడం లేదు. కాంతమ్మ ఎక్కడున్నారనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాను.

– డాక్టర్ చిరంజీవినాయుడు, మెడికల్ ఆఫీసర్, కల్లేపల్లి పీహెచ్‌సీ

అరసవల్లి:

ఆమె పేరు కాంతమ్మ..
వైద్యారోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.
ఈ నెల 2 నుంచి విధులకు హాజరుకావడం లేదు.

దీంతో ఆమె కుటుంబ సభ్యులు 'మిస్సింగ్' అంటూ పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే 22 రోజులు దాటినప్పటికీ ఆమె ఆచూకీపై స్పష్టత రాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగాల పేరిట అక్రమాలు చేస్తున్న సిండికేట్‌లో ఈమె పాత్ర కూడా ఉందన్న వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో 'కాంతమ్మ' మిస్సింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. ఇప్పటికే ఉద్యోగాల పేరిట మోసాలు, ఫేక్ జాయినింగ్ ఆర్డర్లు, అక్రమ వసూళ్ల వ్యవహారాల్లో జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన పలువురు ఉద్యోగుల ప్రమేయంతో శాఖాధికారులు తలపట్టుకుంటుంటే.. ఇప్పుడు కాంతమ్మ వంతువచ్చింది. వాస్తవానికి ఎంతో మంది నుంచి ఉద్యోగాల పేరిట రూ.లక్షల్లో డబ్బులు వసూళ్లు చేసినట్లుగా ఈమెపై పలు అభియోగాలున్నాయి. సిండికేట్ వ్యూహమా..లేక బాధితుల నుంచి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక ఈమె ఎక్కడికైనా వెళ్లిపోయుంటుందా.. లేక వ్యూహాత్మకంగా తప్పించుకునేలా ప్లాన్ అమలు చేస్తున్నారా..అన్న చర్చ జోరందుకుంది.



సరుబుజ్జిలిలో మిస్సింగ్ కేసు..

జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.కాంతమ్మ ఉద్యోగాలిప్పిస్తామంటూ పలువురి నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేశారనే ఫిర్యాదులు నెలన్నర రోజుల క్రితమే డీఎంహెచ్‌వో బి.మీనాక్షికి చేరాయి. రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి కూడా లిఖితపూర్వక ఫిర్యాదులు వెళ్లాయి. ఇదే సందర్భంలో జిల్లా కేంద్రంలో ఓ నిరుద్యోగ మహిళ ఉద్యోగం కోసం మోసపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో డీఎంహెచ్‌వో తక్షణ చర్యల్లో భాగంగా ఆమె డిప్యుటేషన్‌ను రద్దు చేసి హుటాహుటిన రెగ్యులర్ ప్లేస్ అయిన కల్లేపల్లి పీహెచ్‌సీకి గత నెల 24న పంపించేశారు. అయితే ఈమె చేతిలో మోసపోయిన బాధితులు మాత్రం నిత్యం ఆమె కోసం అటు కల్లేపల్లి.. ఇటు డీఎంహెచ్‌వో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నెల 2 నుంచి కల్లేపల్లి పీహెచ్‌సి విధులకు హాజరుకాకపోవడంతో కుటుంబసభ్యులు సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 10న మిస్సింగ్ కేసు నమోదయ్యింది. ఇప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో బాధితులు ఆందోళనలో ఉన్నారు.

సిండికేట్‌లో అంతర్యుద్ధం!

జిల్లా వైద్యారోగ్యశాఖలో అక్రమ ఉద్యోగాల పేరిట దందా కొనసాగుతుందనే సంగతి విదితమే. ఇందులో కీలకంగా ఓ ముఖ్య అధికారితో పాటు పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, కొందరు రెగ్యులర్ ఉద్యోగులంతా సిండికేట్‌గా ఏర్పడి నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు చేసేస్తున్నారు. ఇటీవల ఈ వ్యవహారాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి జి.వి.నరసింహంపై చర్యలకు సైతం డీఎంహెచ్‌వో ఉపక్రమించారు. ఈ అక్రమ వ్యవహారాల్లో పాత్రధారులపై కూడా విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సిండికేట్ ముఠాలో పొరపొచ్చాలొచ్చినట్లు సమాచారం. బాధితుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో వ్యూహాత్మకంగానే కాంతమ్మ మిస్సింగ్ జరిగినట్లు చర్చసాగుతోంది. ఆమె బయటపడితే.. అసలు కారకులు, అక్రమ వ్యవహారాలు నడిపే వ్యక్తులంతా బయటపడతారనే అనుమానాలతో పక్కా ప్రణాళిక అమలు చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు మిస్సింగ్ కేసును కచ్చితంగా ఛేదించేలా చర్యలకు దిగినట్లు సమాచారం.

పలాస–కాశీబుగ్గ గ్యాంగ్ రేప్ ఘటన ▸ ముగ్గురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

- నిందితులపై పోక్సో కేసు నమోదు
- రిమాండ్‌కు తరలింపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పలాస–కాశీబుగ్గలో జరిగిన లైంగికదాడి ఘటనకు సంబంధించి నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు బాలికలను బాధితులుగా గుర్తించామని, అందులో ఒకరికి 16 ఏళ్లు, మరొకరికి 17 ఏళ్ల వయసున్నట్లు తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నేరం చేసిన ముగ్గురు నిందితులను మేజర్లుగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కేసులో ఏ–1గా ఉన్న రాజమహేంద్రం సాయి(19)కి 16 ఏళ్ల బాధితురాలితో ముందు నుంచీ పరిచయం ఉందన్నారు. బాధితురాలి తల్లి నడుపుతున్న టీ షాప్ వద్దకు రెండేళ్లుగా వెళుతున్నాడని, ఈ క్రమంలో బాధితురాలు పరిచయమైందని పేర్కొన్నారు. ఈ నెల 19న సాయి తన పుట్టిన రోజు వేడుకల కోసం స్నేహితులు రాధామోహన్‌రావు(20), పైల శివ (21)తో పాటు ఇద్దరు బాలికలను తీసుకొని ఓ ప్రాంతానికి వెళ్లి మద్యం తాగారని చెప్పారు. అనంతరం శివ స్నేహితుడి గదికి బాలికలను తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారని తెలిపారు. నిందితుల ఫోన్లను స్వాధీనం చేసుకుని వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌ల ఆధారంగా కూడా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. ఈ ఘటన 19వ తేదీ సాయంత్రం 6:15 నుంచి రాత్రి 10 గంటల మధ్య జరగగా, బాధితులు పరువు పోతుందేమోనని భయపడి ఒకరోజు ఆలస్యంగా(ఈ నెల 21వ తేదీన) పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేసి బాధితులకు మెడికల్ టెస్టులు చేయించామని స్పష్టం చేశారు. నిందితుడు రాజమహేంద్రం సాయి ఐటీఐ చదువుతుండగా, స్నేహితుడు రాధామోహన్‌రావు సీసీ కెమెరా టెక్నీషియన్‌గా, పైల శివ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. రాజకీయ నాయకులు బాధితులను ప్రలోభపెట్టే ప్రయత్నం చేయడం వంటివి తమ దృష్టికి రాలేదని స్పష్టం చేశారు. నిందితులకు మద్యం, స్మోకింగ్ అలవాటు ఉందని చెప్పారు. సమగ్రంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ, ఇన్‌చార్జ్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ సీఐ దాడి మోహనరావు, ఎస్బీ సీఐ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎస్ఈ కృష్ణమూర్తిని కలిసిన వేంకటేశ్వరరావు

అరసవల్లి: విద్యుత్ శాఖ టౌన్ ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈగా చల్లా వేంకటేశ్వరరావు బుధవారం విధుల్లోకి చేరారు. తాజా బదిలీల్లో భాగంగా వచ్చిన ఈయన ముందుగా అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఎంఆర్‌టీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. తర్వాత మర్యాదపూర్వకంగా ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తిని, ఆపరేషన్స్ ఈఈ యోగేశ్వరరావును కలుసుకున్నారు. స్టోర్స్ డిప్యూటీ ఈఈ ఎస్.శ్రీనివాస్, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

తక్షణ ప్రవేశాలకు స్పందన కరువు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రెండు విడతలు పీజీ ప్రవేశాలు తర్వాత మిగులు సీట్లుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రవేశాలు చేపట్టారు. అనంతరం 22, 23 తేదీల్లో నిర్వహించిన ప్రవేశాలు ఆన్‌లైన్ చేశారు. రెగ్యులర్ కౌన్సెలింగ్‌లో వర్సిటీలో 16 కోర్సుల్లో 562 సీట్లుకు 243 ప్రవేశాలు జరిగాయి. 319 ఖాళీ సీట్లు ఉన్నాయి. కాగా తక్షణ ప్రవేశాలు కేవలం 5 మాత్రమే జరిగాయి. తక్షణ ప్రవేశాలకు సైతం ఏపీ పీజీ సెట్ అర్హత నిబంధన వల్ల ప్రవేశాలు జరగలేదు. సెట్ అర్హత తొలగించి, డిగ్రీ అర్హతగా ప్రవేశాలు నిర్వహిస్తే ప్రవేశాలు జరిగే అవకాశం ఉందని ఫ్యాకల్టీ సభ్యులు అంటున్నారు. అధికారులు మాత్రం ఉన్నత విద్యా మండలి నిబంధనల మేరకు సెట్ అర్హత తప్పనిసరి అని స్పష్టం చేస్తున్నారు.

కారును ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



రక్తపు మడుగులో చాణుక్య మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : కారును బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం చెందిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు. బ్యాంకర్స్ కాలనీలో నివాసముంటున్న సోమయాజుల వెంకటశ్రీనివాస్, ఈశ్వరి దంపతుల కుమారుడు వెంకటకృష్ణ చాణుక్య (23) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. దసరా సెలవులకని ఇంటికొచ్చి వర్క్‌ఫ్రం హోం చేసుకుంటున్నాడు. ఇంకా వివాహం కాలేదు. స్నేహితులు పిలవడంతో 80 ఫీట్ రోడ్డులో టీ తాగేందుకు వెళ్లాడు. అక్కడ స్నేహితుడి స్పోర్ట్స్ బైక్‌ను తీసుకుని డ్రైవ్ చేయగా అరసవిల్లి మిల్లు జంక్షన్ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టాడు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు, సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.


జీఎన్ఎం కోర్సులో ప్రవేశాలు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆసుపత్రి బొల్లినేని మెడిస్కిల్స్‌లో హెల్త్‌కేర్ రంగానికి సంబంధించి జీఎన్ఎం కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వరకూ అడ్మిషన్లకు అవకాశం ఉందని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత, ఉద్యోగంలో జాయినింగ్ అయ్యాక ఫీజు కట్టుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో వెస్ట్ బెంగాల్‌కి చెందిన యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని పలాస జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. అతను తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్‌లో వెస్ట్ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌కి చెందిన సంతు కర్మాకర్(24) అనే యువకుడు డౌన్‌లైన్ ట్రాక్‌లో బరంపురం వైపు వెళ్లే గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక రైల్వేస్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేవీకి ఎంపికైన విద్యార్థిని



బచ్చల బుజ్జి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం-4లో ఉంటూ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న బచ్చల బుజ్జి ఇండియన్ నేవీకి ఎంపికైంది. జిల్లాలో వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం మెళియాపుట్టి గ్రామంలో ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి తల్లి, వసతి గృహం సంక్షేమాధికారి జి.లలిత ప్రోత్సాహంతో బుజ్జి సత్తాచాటింది. ఈ అమ్మాయిని తండ్రి మరణించడంతో తల్లి రాధమ్మ కూలి పనులు చేసుకుంటూ చదివిస్తున్నారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు అభినందించారు.

ఐటీడీఏ ఏర్పాటుకు.. మోక్షమెప్పుడో?



ఐటీడీఏ ఏర్పాటు చేయాలని దీక్ష చేస్తున్న గిరిజన సంఘాలు (ఫైల్)



- తాము అధికారంలోకి వస్తే మెళియాపుట్టిలో ఏర్పాటు చేస్తామన్న కూటమి నేతలు
- హామీని నిలబెట్టుకోవాలంటున్న గిరిజన సంఘం నేతలు
- 100 కిలోమీటర్ల దూరంలోని సీతంపేట వెళ్లాల్సి వస్తోందని ఆవేదన

మెళియాపుట్టి:

సార్వత్రిక ఎన్నికల సమయంలో పాతపట్నం నియోజకవర్గానికి వచ్చిన కూటమి నేతలు.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పించారు. ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నా ఆ ఊసే వినిపించకపోవడంతో గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. జిల్లాల పునర్విభజనలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ(ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ- సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ) పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసిపోయిన సంగతి తెలిసిందే. సమస్యలు చెప్పుకోవడానికి సుమారు 80 నుంచి 1000 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతంపేట ఐటీడీఏకు వెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో మెళియాపుట్టి, మందస, కొత్తూరు, పాతపట్నం మండలాల్లో అధికంగా గిరిజనులు ఉన్నారు. 16 గిరిజన ఉప ప్రణాళిక మండలాలు ఉన్నాయి. విభజన ప్రక్రియలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 847 గిరిజన గ్రామాలు ఉండగా శ్రీకాకుళం జిల్లాకు 469, మన్యం జిల్లాకు 378 గ్రామాలను కేటాయించారు. అయితే విభజన అనంతరం రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. అత్యధిక గిరిజన గ్రామాలు ఉండి, అన్ని గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే మెళియాపుట్టి మండలకేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఇదివరకే గిరిజన సంఘాలు పలు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు, ఆందోళనలు చేశారు. అయినా ఇంతవరకు మోక్షం కలగలేదు.

100 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

గిరిజనుల సమస్యలపై అధికారులకు చెప్పాలంటే సీతంపేటలో ఉన్న ఐటీడీఏకు 80 నుంచి 100 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సిందే. మందస, నందిగాం, మెళియాపుట్టి, పాతపట్నం, సారవకోట, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన గిరిజనులు సమస్యలతో సతమతమవుతున్నా ఆర్థిక స్తోమత లేక వెళ్లలేకపోతున్నారు. స్థానికంగా ఐటీడీఏ ఏర్పాటైతే సమస్యలు తీరుతాయని గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు చెబుతున్నారు.

మూడు బస్సులు మారాలి..



సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లడమే మాకు పెద్ద సమస్యగా మారింది. సీతంపేట ఐటీడీఏకు వెళ్లాలంటే మూడు బస్సులు మారాలి. రూ.500 ఖర్చు అవుతుంది. ఎన్నిసార్లు వెళ్లగలం. ఆర్థిక పరిస్థితులు బాగోలేక సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లలేకపోతున్నాం. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.

– పద్దూరు భీమారావు, దీనబంధుపురం, మెళియాపుట్టి మండలం

పోరాటాలు చేస్తున్నా..



గిరిజనుల కష్టాలు తీరాలంటే ఐటీడీఏ ఏర్పాటు అవసరం. దీనికోసం రాష్ట్రం, జిల్లా స్థాయిలో ఆందోళనలు, దీక్షల ద్వారా పోరాటాలు చేస్తూనే ఉన్నాం. ఢిల్లీ వరకు వెళ్లి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల మెళియాపుట్టి మండలం కేరాసింగి గ్రామాన్ని ఆయన సందర్శించిన సమయంలోనూ సమస్య వివరించాం. – వాబ యోగి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

న్యాయం చేయాలి..



జిల్లా విభజన జరిగిన అనంతరం శ్రీకాకుళం జిల్లా గిరిజనులు తీవ్రంగా నష్టపోయారు. సీతంపేట ఐటీడీఏ మన్యం జిల్లాకు వెళ్లిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రిని సైతం కలిసి వినతిపత్రం అందించాం. గిరిజన యువత ఎంతోమంది న్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్నారు. ఐటీడీఏ వస్తే ఉపాధి లభిస్తుంది.

– చల్లా శాంతారావు, గిరిజన సంఘం నేత, మెళియాపుట్టి మండలం

పోర్టు ఘనత వైఎస్సార్‌సీపీదే

- జగన్ హయాంలోనే 75 శాతం పనులు పూర్తి
- కూటమి వచ్చాక వాటాలు తేలలేదని పనులు నిలిపివేశారు
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా జిల్లా ప్రజల కలగా ఉన్న మూలపేట పోర్టును సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని అక్కవరం సమీపంలో మీడియా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే 75 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఎన్నికల ముందు వరకు శరవేగంగా పోర్టు పనులు జరిగాయని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మంత్రి అచ్చెన్నాయుడికి అందాల్సిన వాటాల్లో లెక్క తేలకపోవడంతో పోర్టు పనులను నిలిపివేశారని దుయ్యబట్టారు. ప్రస్తుతం పోర్టు నిర్మాణంలో భాగంగా స్థానికంగా ఉన్న డిమాండ్లు ప్రస్తావించకుండా మంత్రి అచ్చెన్నాయుడు మరలా ఎలా పనులు ప్రారంభించారని ప్రశ్నించారు. గతంలో పోర్టు పనులు జరుగుతున్న సమయంలో కొన్ని రకాల డిమాండ్లను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

అభివృద్ధికి అడ్డు చెప్పం

అభివృద్ధికి తాము ఎక్కడా అడ్డు చెప్పమని ఎమ్మెల్సీ దువ్వాడ స్పష్టం చేశారు. అయితే పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు ప్రకారం పోర్టు పరిసర ప్రాంతాలకు హిరమండలం నుంచి మంచినీటి సరఫరా ఎప్పుడు ప్రారంభిస్తారని, యూత్ ప్యాకేజీ ఫైల్‌ను ఎప్పుడు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీకి అదనంగా నిధులు ఇవ్వాలని, స్థానికంగా ఉన్నవారికి 75 శాతం మేరకు పనులు కల్పించాలని, గ్రామకంఠం ఉన్నవారికి పరిహారం ఇవ్వాలన్నారు. పోర్టు పనుల్లో గంపగుత్తగా ఒకరికే కాకుండా స్థానికులకు అవకాశం కల్పించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోర్టు పనుల్లో తొలగించిన వారిని తక్షణమే పనుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కల్పనలో భాగంగా తన వద్దనున్న సుమారు 12 వేల దరఖాస్తులకు అనుగుణంగా వారందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. పోర్టు పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియజేయాలన్నారు. ఈ విషయంలో తేడా వస్తే ఉద్యమానికి సిద్ధంగా ఉంటానని హెచ్చరించారు.

ప్రతిభ కనబర్చిన అజయ్ కుమార్



సీఎం చంద్రబాబు చేతులమీదుగా చెక్కు అందుకుంటున్న అజయ్‌కుమార్





తయారు చేసిన డ్రోన్ హెలీకాప్టర్ (ఇన్‌సెట్లో) అజయ్‌కుమార్

కోటబొమ్మాళి: మండలంలోని మారుమూల దంత గ్రామానికి చెందిన శిమ్మ అజయ్‌కుమార్ త్రీడీ ప్రింటెడ్ టెక్నాలజీతో డ్రోన్ హెలీకాప్టర్ తయారు చేసి శభాస్ అనిపించుకున్నాడు. మంగళవారం విజయవాడలో జరిగిన డ్రోన్ సమ్మిట్ ఆవిష్కరణ కార్యక్రమంలో అజయ్‌కుమార్ డ్రోన్ హెలీకాప్టర్‌ను ప్రదర్శించి ఈ పోటీల్లో ఇండియా స్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు. దీనిలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా రూ.లక్ష చెక్కు అందుకున్నాడు. అజయ్‌కుమార్ తలిదండ్రులు జగన్నాథరావు, లక్ష్మీ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అజయ్ 7వ తరగతి వరకు స్వగ్రామంలో, అక్కడ నుంచి 10వ తరగతి వరకు కురుడు హైస్కూల్‌లో చదువుకున్నాడు. అనంతరం లఖిరెడ్డి బలిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో పాలి టెక్నికల్ ఏరో నాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అదే సమయంలో డ్రోన్ల తయారీలో నైపుణ్యం పెంపొందించుకున్నాడు. రైతు కుటుంబానికి చెందిన తనకు ఆర్థిక స్తోమత లేకపోయినా, తల్లిదండ్రుల సహకారంతో రూ.10 లక్షలు ఖర్చుచేసి, ఆరేళ్లపాటు శ్రమించి 40 కేజీల బరువు గల డ్రోన్ హెలీకాప్టర్‌ను తయారు చేసినట్లు వెల్లడించారు. ఈ డ్రోన్ హెలీకాప్టర్ వ్యవసాయ రంగం, వైద్యం, యుద్ధాలు, విపత్తుల సమయాల్లో ఉపయోగపడుతుందని తెలిపారు. అతడిని కోటబొమ్మాళి ఎంఈవో లఖినేని విశ్వప్రతాప్, కురుడు హైస్కూల్ సోషల్ స్టడీస్ టీచర్ కరిమి రాజేశ్వరరావు, దంత యూపీ స్కూల్ హెచ్ఎం గొండు నారాయణరావు తదితరులు అభినందించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



పోలీసుస్టేషన్ వద్ద విలపిస్తున్న గ్రామస్తులు



మృతి చెందిన లక్ష్మణ్

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస వద్ద ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న ఎన్టీఆర్ కాలనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పొన్నాంపేట గ్రామానికి చెందిన గృహ నిర్మాణ కార్మికుడు (తాపీ మేస్త్రీ) కర్రి లక్ష్మణ్ (24) ప్రతిరోజూ ఆ కాలనీలో కూలి పని చేసేందుకు వెళ్తున్నాడు. అదేవిధంగా బుధవారం పనికి వెళ్లిన మృతుడు పని ప్రారంభానికి ముందు నీరు అవసరమని, అక్కడ ఉన్న విద్యుత్ వైర్లను మోటారు వేసేందుకు ప్లగ్‌లో పెడుతుండగా విద్యుత్ షాక్‌తో పడిపోయాడు. వెంటనే తోటి కార్మికులు జొన్నవలస గ్రామంలో ఉన్న 30 పడకల సామాజిక ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి యువకుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, సిమ్మయ్యలు కన్నీటి పర్యంతమయ్యారు. లక్ష్మణ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు.

పెళ్లి పీటలు ఎక్కాల్సిన సమయంలో...

మృతుడికి పాలకొండకు చెందిన ఒక అమ్మాయితో వివాహం కుదిరిందని, ఫిబ్రవరి నెలలో వివాహానికి ముహూర్తం కూడా పెట్టుకున్నారని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి పీటలు ఎక్కించాల్సిన యువకుడిని పాడె ఎక్కించాల్సి వచ్చిందని వారంతా చేస్తున్న రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి



కొత్తూరు: పాతపట్నం ఏకలవ్య పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సీతంపేట మండలం బందరిల్లి బుడ్డడుగూడకు చెందిన సవర నాగ్రమ్, అక్కమ్మ దంపతుల కుమార్తె సవర లావణ్య ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. లావణ్య మృతిపై అనుమానాలు ఉన్నందున వాస్తవాలు వెలికితీసేవిధంగా దర్యాప్తు నిర్వహించాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

నవంబర్ 19 నుంచి బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబర్ 19 నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. నవంబర్ 4లోపు రిజిస్ట్రేషన్, పరీక్ష ఫీజు రూ.1335 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రౌడీ షీటర్ హల్‌చల్

- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని దమ్మలవీధిలో మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి ఒక రౌడీ షీటర్ హల్‌చల్ చేశాడు. బాకర్‌సాహెబ్‌పేటలో మరో వ్యక్తి కూడా మద్యం మత్తులో అల్లరి చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయస్థానం ఇరువురికీ 14 రోజుల రిమాండ్ విధించింది. ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి దమ్మలవీధిలో నివసిస్తున్న రౌడీషీటర్ వండాన ఢిల్లీశ్వరరావు (ఢిల్లీ) మద్యం మత్తులో స్థానికులతో గొడవపడ్డాడు. దీంతో 112కి వారు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఢిల్లీని అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు రాత్రి బాకర్‌సాహెబ్‌పేటలో బద్రి త్రినాథరావు అనే యువకుడు పూటుగా మద్యం సేవించి అక్కడి నివాస గృహాల వారికి ఇబ్బందులు సృష్టించాడు. దీంతో వారు కూడా 112కు ఫిర్యాదు ఇవ్వడంతో త్రినాథరావును పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్ఐ హరికృష్ణ ఇరువురిపై కేసులు నమోదు చేశారు. బుధవారం నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఇరువురికీ 14 రోజుల పాటు రిమాండ్‌తో కూడిన జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ హరికృష్ణ అన్నారు. వండాన ఢిల్లీశ్వరరావుపై రౌడీషీట్ ఉండగా, బద్రి త్రినాథరావుపై గతంలోనూ కేసులున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఎవరైనా ఇలా మద్యం బహిరంగంగా సేవించి అల్లర్లుకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మొన్నటికి మొన్న ఇలాగే అల్లరి చేసిన రౌడీషీటర్‌ను రిమాండ్ జైలుకు తరలించామన్నారు.

భర్త మృతిని తట్టుకోలేక భార్య మృతి



గుండ ధర్మారావు



గుండ తవిటమ్మ

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామానికి చెందిన గుండ ధర్మారావు (70) ఈనెల 20వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో భర్త మరణాన్ని తట్టుకోలేక అనారోగ్యం పాలైన భార్య తవిటమ్మ (65) శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఇద్దరూ రెండు రోజుల వ్యవధిలో ఒకే సమయంలో మృతి చెందారని స్థానికులు తెలిపారు. వీరికి ముగ్గురు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల కాగా, పెద్ద కుమారుడు క్యాన్సర్‌తో కొంతకాలం క్రితం మరణించాడు. దీంతో అతని పిల్లల బాగోగులు సైతం వృద్ధులు చూసేవారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక తవ్వకాలు అడ్డగింత



నదికి వెళ్లే మార్గంలో గ్రామస్తులు తవ్విన గోతులు

నరసన్నపేట: మండలంలోని మడపాం వద్ద వంశధార నదిలో ఇసుక తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామస్తులు విజ్ఞప్తితో సర్పంచ్, ఎంపీటీసీలు ఎరుకోడు, రువ్వ వాసులతో పాటు పలువురు నదిలో ర్యాంపునకు వెళ్లే మార్గంలో జేసీబీతో తవ్వేశారు. దీంతో ట్రాక్టర్లు నదిలోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. నాటుబండ్లుతో పాటు ట్రాక్టర్లూ ఉచితంగా ఇసుక తవ్వుకోవచ్చని ప్రభుత్వం అనుమతినివ్వడంతో వందలాది ట్రాక్టర్లు ఆది, సోమవారాల్లో నదిలోనికి దించారు. రెండు రోజులూ రాత్రి, పగలు తేడా లేకుండా లోడింగ్ చేశారు. దీంతో గ్రామంలో ఇరుకు రోడ్లపై ప్రమాదాలు జరిగాయి. ట్రాక్టర్ల శబ్దాలతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఇలానే కొనసాగిస్తే మరిన్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని భావించి గ్రామస్తులు సమైఖ్యంగా నిర్ణయం తీసుకొని తవ్వకాలను అడ్డగించారు. దీంతో మడపాం వద్ద వంశధార నదిలో ఇసుక తవ్వకాలు మంగళవారం నుంచి నిలిచిపోయాయి. ప్రస్తుతం బుచ్చిపేట, చేనులవలస, లుకలాం, ఉప్పరిపేట, గోపాలపెంటల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అలాగే ట్రాక్టర్లుకు ఇచ్చిన అవకాశాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ట్రాక్టర్లులో ఇసుకను ఉచితంగా తవ్వి లారీలకు లోడు చేసి విశాఖ పంపుతున్నారు. ఎటువంటి రశీదులు లేకుండా లారీల్లో ఇసుక విశాఖకు తరలుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు



మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నేర సమీక్ష నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, ప్రజా ఫిర్యాదులు, ఎన్డీపీఎస్, సైబర్, ప్రాపర్టీ, మహిళలపై దాడులు తదితర కేసుల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై దృష్టిపెట్టి అల్లర్లు, గొడవలు జరగకుండా చూసుకోవాలన్నారు. సమీక్షలో డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ప్రసాదరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన సపక్‌తక్ర స్టేట్‌మీట్

- మహిళల ఛాంపియన్‌గా నిలిచిన ఆతిథ్య శ్రీకాకుళం
- పురుషుల విభాగంలో కర్నూలు విజయకేతనం
- విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ మంత్రి కృష్ణదాస్



ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారిణుల జోరు



మహిళల ఛాంపియన్‌గా నిలిచిన శ్రీకాకుళం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కృష్ణదాస్ తదితరులు



పురుషుల ఛాంపియన్‌గా నిలిచిన కర్నూలు జిల్లాకు టైటిల్‌ను అందజేస్తున్న ఎమ్మెస్సార్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన 34వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) సీనియర్స్ పురుషులు, మహిళల సపక్‌తక్ర ఛాంపియన్‌షిప్-2024 పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ప్రభుత్వం నుంచి రూపాయి సాయం లేకపోయినప్పటికీ.. పోటీలకు హాజరైన క్రీడాకారులను ఆకట్టుకునేలా సౌకర్యాలు, వసతులు, భోజనాలు ఏర్పాటు చేసిన సపక్‌తక్ర సంఘ జిల్లా బాధ్యులు శభాష్ అనిపించారు. ఆద్యాంతం హోరాహోరిగా సాగిన మహిళల విభాగ పోటీల్లో ఆతిధ్య శ్రీకాకుళం జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. తూర్పు గోదావరితో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 2–1 సెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఆద్యాంతం రసత్తవరంగా సాగిన పురుషుల విభాగం పోరులో కర్నూలు జిల్లా విజేతగా నిలిచింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాతో జరిగిన ఫైనల్ పోరులో 2–1 సెట్ల తేడాతో కర్నూలు విజయదుందుబీ మోగించింది.

క్రీడాకారులకు విశ్వవ్యాప్త గుర్తింపు: కృష్ణదాస్

క్రీడాకారులకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జరిగిన ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడలకు ఆర్థికంగా చేయూతను అందిస్తూ నిరంతరం ప్రోత్సహిస్తున్న ఎమ్మెస్సార్, పద్మావతి దంపతులను, స్వరూప్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అన్ని క్రీడాసంఘాలు, అందరి ఆమోదంతో శ్రీకాకుళం ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెస్సార్ కృష్ణమూర్తిని ప్రతిపాదిస్తామని కృష్ణదాస్ చెప్పుకొచ్చారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి మాట్లాడుతూ ఓటమి నుంచి గెలుపునకు బాటలు వేసుకోవాలని, క్షేమంగా మీమీ జిల్లాకు చేరుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఎంవీ స్వరూప్ రెండు రోజులపాటు జాతీయ స్థాయి టోర్నీని తలదన్నే విధంగా స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించినందుకు గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నీలు శ్రీకాకుళంలో నిర్వహిస్తామన్నారు. సపక్‌తక్ర జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డిలు మాట్లాడుతూ రెండు రోజుల పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సపక్‌తక్ర సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీడీ మురళీకృష్ణ, మానస హోటల్ పైడి శ్రీనివాస్, ట్రాఫిక్ జామ్ శ్రీనివాస్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, సుందరరావు మాస్టారు, బీఏ లక్ష్మణ్‌దేవ్(అను), అంబటి శ్రీనివాస్, బాలమురళి, వేణుగోపాల్, బాబ్జి, కొర్లయ్య పాల్గొన్నారు.